ఏడుస్తున్న శవాలు..!

- పోస్టుమార్టానికి ఎక్కువ వస్తే అంతే
- ఐదు శవాల్లో రెండు ఫ్రీజర్‌లో, మూడు మార్చురీలోనే..!
- గత ప్రభుత్వంలో ఆధునికీకరించిన మార్చురీ
- సౌకర్యాలున్నా ఏర్పాటు కాని డీ ఫ్రీజర్లు
- మృతుల బంధువులకు తప్పని పడిగాపులు


గత ప్రభుత్వంలో నిర్మించిన పలమనేరు ఏరియా ఆస్పత్రి



డీ ఫ్రిజ్ లేక మార్చురీలో ఉంచిన మృతదేహాలు

పలమనేరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు మంచి వైద్యం అందించాలనే ఆలోచనతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ఆస్పత్రుల నిర్మాణం, పాత ఆస్పత్రుల ఆధునికీకరణ, అవసరమైన సౌకర్యాలను కల్పనకు ప్రాధాన్యత ఇచ్చి ఆ పనులు పూర్తి చేసింది. ప్రస్తుతం అధికార కూటమి ప్రభుత్వం ఆస్పత్రులను నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో రోగుల పరిస్థితి అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అనే చందాన తయారైంది. సోమవారం పలమనేరు ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం ఐదు మృతదేహాలు వచ్చాయి. అయితే కొత్తగా నిర్మించిన మార్చురీలో పది మృతదేహాలకు అవసరమైన స్థలాన్ని దానికి కావాల్సిన హై ఓల్టేజీ కరెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ శవాలను నిల్వ ఉంచే డీఫ్రీజర్లను ఇంకా ఏర్పాటు చేయలేదు. దీంతో ఆస్పత్రిలో గతంలో నుంచి అందుబాటులో ఉన్న రెండు డీ ఫ్రీజర్లలో రెండు శవాలను పెట్టి మిగిలిన మృతదేహాలను మార్చురీ గదిలో స్ట్రెచర్‌పై పెట్టాల్సి వచ్చింది. దీనికి తోడు పీఎం చేసే డాక్టర్లు ఒకేసారి ఇన్ని శవాలకు పోస్టుమార్టం చేసేందుకు ఆలస్యమవుతుండడంతో మృతుల కుటుంబీకులు, బంధువులు ఆ గది ముందు పడిగాపులు కాయాల్సి వస్తోంది.


అందుబాటులో ఉన్న రెండు డీ ఫ్రిజ్‌లు

సోమవారం ఏమి జరిగిందంటే..!

నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలంలో బైరెడ్డిపల్లె మండలానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అదే మండలం నుంచి మరో మృతదేహం సైతం పీఎంకు వచ్చింది. పలమనేరు మండలం కూర్మాయికి చెందిన ఓ మహిళ, బైరెడ్డిపల్లె మండలానికి చెందిన ఆత్మహత్య చేసుకున్న యువతి, రోడ్డు ప్రమాదంలో పీఈఎస్‌లో మృతిచెందిన మరో వ్యక్తి శవాలు ఒక్కసారిగా పోస్టుమార్టం కోసం స్థానిక ఏరియా ఆస్పత్రికి వచ్చాయి. దీంతో మార్చురీలో ఉన్న రెండు ఫ్రీజింగ్ బాక్సుల్లో రెండు శవాలను మాత్రం ఉంచి మిగిలిన శవాలను అలాగే పెట్టారు. దీనిపై మృతుల కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని కోట్లతో ఆస్పత్రిని జగనన్న ప్రభుత్వం కట్టిస్తే ఇప్పటి కూటమి ప్రభుత్వం కొత్తగా కట్టిన మార్చురీలో కనీసం డీ ఫ్రీజ్ యూనిట్‌ను ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కారణంగా పోస్టుమార్టం ఆలస్యం కావడంపై అక్కడే పడిగాపులు కాశారు.

నియోజకవర్గంలో ఈ ఆస్పత్రే దిక్కు

నియోజవర్గంలోని ఐదు మండలాల్లోని పది పీహెచ్‌సీల పరిధిలో ఎక్కడ.. ఎవరు ఆత్మహత్య చేసుకున్నా, ప్రమాదాల్లో మృతిచెందినా అక్కడి పోలీసులు పలమనేరు ఏరియా ఆస్పత్రికే పోస్టుమార్టం కోసం మృతదేహాలను తరలిస్తారు. ఇకనైనా ఇక్కడ అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలని, ఆ దిశగా ఎమ్మెల్యే చొరవ చూపాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో మారిన రూపురేఖలు

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ ఆస్పత్రిని వంద పడకలుగా మార్చి నాడు–నేడు పథకం కింద రూ.16 కోట్లతో అదనపు భవనాలను నిర్మించింది. ఆస్పత్రిలోని ఐదు బ్లాకులతో పాటు అదనంగా మరో ఐదు బ్లాకులు కొత్త ఆస్పత్రిలో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆధునిక మార్చురీని సైతం నిర్మించారు. గతంలోని మార్చురీ గదిలో కేవలం రెండు శవాలను మాత్రమే డీఫ్రిజ్‌లో పెట్టే అవకాశం ఉండేది. ఈ సమస్యను గుర్తించి 8 శవాలు డీఫ్రిజ్ చేసేలా దీన్ని నిర్మించారు. దీనికి అవసరమైన కరెంట్ సౌకర్యాన్ని కల్పించారు. కానీ ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇందులో కొత్త డీఫ్రిజ్ ఏర్పాటుపై దృష్టి సారించడం లేదు. దీంతో ప్రమాదాలు, ఆత్మహత్య కేసుల్లో ఎక్కువ మృతదేహాలు పీఎంకు వచ్చినప్పుడు శవాలకు నిరీక్షణ తప్పడం లేదు. మృతుల బంధువుల వేదనకు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఫలితంగా శవాలు శివ..శవా అని రోదిస్తున్నట్టు మార్చురీ మౌన ప్రేక్షకురాలవుతోంది.

క్లుప్తంగా

మండల సమావేశం రేపు

సదుం : మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ధనుంజయరెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హరిబాబు తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నటుడు వెంకటేష్‌ను కలిసిన అభిమానులు

పుంగనూరు : పట్టణానికి చెందిన మంజునాథ్ ఆధ్వర్యంలో నటుడు వెంకటేష్‌ను అభిమానులు కలిసి సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం పట్టణానికి చెందిన పలువురు అభిమానులు హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో వెంకటేష్‌ను కలిసి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం సక్సెస్‌పై అభినందనలు తెలిపారు. వెంకటేష్ తన అభిమానులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు


వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న ఫ్రాన్స్ ప్రతినిధులు

పలమనేరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు తక్కువ పెట్టుబడితోపాటు మంచి దిగుబడులే కాకుండా సమాజానికి సైతం ఇది మేలు చేస్తుందని ఫ్రాన్స్ దేశానికి చెందిన రేణుకజార్జ్, రైతు సాధికారిక సంస్థ అధికారి మన్మోహన్ తెలిపారు. ఆమేరకు వారు పలమనేరు మండలంలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పలువురు రైతుల పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొరం గ్రామంలోని రమేష్, కూర్మాయి గ్రామంలోని చందూల్ రెడ్డి రైతులు పండించిన సేంద్రియ పంటలను వారు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఓ సంధ్య, డీఆర్సీ భారతి, స్పందన, మహేష్, రైతులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు


చేతి పంపు నుంచి వస్తున్న నీరు

గుడుపల్లె: మండలంలోని ఆవుల తిమ్మనపల్లెలో తాగునీటి కోసం బోరుకు మరమ్మతులను సర్పంచ్ వెంకటేశు, కార్యదర్శి చంద్రప్ప చేయించారు. గతంలో తాగు నీటి కోసం గ్రామానికి 200 అడుగులు లోతులో బోరు వేశారు. దీంతో నీటి మట్టం పైభాగానే ఉండడంతో మంగళవారం 80 అడుగులు పైపులు వదిలి చేతి పంపును అమర్చారు. దీంతో నీరు పుష్కలంగా రాడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా గంగ జాతర


పొంగళ్లు పెట్టడానికి వెళ్తున్న మహిళలు

బైరెడ్డిపల్లె: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలోని శెట్టిపల్లెలో మంగళవారం ఘనంగా గంగజాతర నిర్వహించారు. ఉదయం పశువులను శుభ్రం చేసి రంగురంగుల పుష్పాలతో అలంకరించి ఎలాంటి దోషాలు కలగకుండా గంగమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామానికి చెందిన మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలు కలగాలని అమ్మవారిని వేడుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


అనిల్‌కుమార్

పెద్దపంజాణి: పెద్దపంజాణి మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సీఎస్.అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పలమనేరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పెద్దపంజాణి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విధుల్లో చేరారు. ఈసందర్భంగా రీసర్వే డీటీ రమేష్‌కుమార్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆయన్ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ పరిధిలోని బస్సుల్లో ప్రయాణికులకు సంబంధించిన సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నేటి ఉదయం 11 నుంచి 12 దాకా జరుగుతుందని స్థానిక ఆర్టీసీ డీఎం టీకే స్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఏదేనీ సమస్యలున్న వారు 9959225678 అనే నంబర్‌కు కాల్ చేయాలని అందులో సూచించారు.

నేడు విద్యుత్ అదాలత్

పలమనేరు: పట్టణంలోని ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయం వద్ద నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు స్థానిక ఏడీ చిన్నబ్బ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు స్పెషల్ అదాలత్ చైర్మన్ రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, పుంగనూరు ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసమూర్తి పాల్గొని వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని అందులో సూచించారు.

తీరిన తాగునీటి సమస్య


పైప్‌లైన్ వేస్తున్న అధికారులు

రొంపిచెర్ల : రొంపిచెర్ల ఎంపీపీ పురుషోత్తంరెడ్డి జోక్యంతో తాగునీటి సమస్య తీరింది. చిచ్చిలివారిపల్లె పంచాయతీలోని ముంతావారిపల్లె, బాటమాదిగ పల్లె గ్రామాల తాగునీటి పైపులైన్‌లు దెబ్బతిని ఆ గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటికి కొన్ని నెలలుగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సమస్యను గ్రామస్తులు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ అరుణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని అధికారులను కోరారు. రూ.40 వేలతో అధికారులు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరా చేయించారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

కలుపుతో అపార నష్టం


కలుపుతీత యంత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు

శాంతిపురం: పంటల్లో కలుపు కారణంగా దిగుబడులు, నాణ్యతకు అపార నష్టం కల్గుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం దండికుప్పం వద్ద కలుపు నివారణ యంత్రాల వినియోగంపై రైతులకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ప్రధాన పంటకు దక్కాల్సిన నీరు, ఎండ, భూసారంలో 40 శాతం వరకు కలుపు మొక్కలు తినేస్తాయని చెప్పారు. భౌతిక, యాంత్రిక, జీవ, రసాయన విధానాలతో కలుపును నియంత్రించవచ్చన్నారు. కలుపు నివారణ యంత్ర పరికరాలపై సబ్సిడీ, శిక్షణ కావాలని స్థానిక రైతులు సీఎంకు వినతి పత్రం ఇచ్చిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ చెప్పారు. రైతుల పరిజ్ఞానం పెంచేలా ఇతర వ్యవసాయ క్షేత్రాల సందర్శనకు వారిని తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. ఏడీఏ సావిత్రి, మండల వ్యవసాయాధికారి అప్పోజి పాల్గొన్నారు.

పశువైద్యశిబిరానికి స్పందన


రైతులకు మందులను అందజేస్తున్న పశు వైద్యుడు పవన్‌కుమార్

చౌడేపల్లె: మండలంలోని పెద్దయల్లకుంట్ల, ఏ.కొత్తకోట గ్రామాల్లో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 526 పశువులకు ఈగలు, పిడుదుల నివారణకు మందు పిచికారీ చేసినట్లు వైద్యాధికారులు పవన్‌కుమార్, దినేష్‌రెడ్డి తెలిపారు. పశువుల్లో గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వేసవిలో పచ్చిమేత సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. అనంతరం డీవార్మింగ్ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి ప్రసాద్, సురేంద్ర, జానకీరామ్, హరిత పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై అక్రమార్కుల కన్ను!

- భూ కబ్జాను అడ్డుకున్న స్థానికులు
- కూటమి నేతల మద్దతుతో రెచ్చిపోతున్న అక్రమార్కులు


మైనింగ్ ఆఫీస్ సమీపంలో కబ్జాకు యత్నించిన అక్రమార్కులు

పలమనేరు: పట్టణంలో గత కొన్నాళ్లుగా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఓ వైపు ఎక్స్‌ప్రెస్ హైవే, మరోవైపు బుల్లెట్ ట్రైన్, శీతల వాతావరణం ఇక్కడ ఉండడంతో ఎక్కువ మంది ఇక్కడ ఉండాలని భావిస్తున్నారు. మరోవైపు అటు చెన్నై, ఇటు బెంగళూరు, సమీపంలో తిరుపతి ఉండడంతో ఇది నివాసాలకు ఆమోద్యయోగంగా మారింది. ఈనేపథ్యంలో ఇక్కడున్న ప్రభుత్వ స్థలాలపై అక్రమార్కుల కన్నుపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ నాయకయల అండతో వీరు రెచ్చిపోతున్నారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో ఇవీ అక్రమాలు..

పట్టణంలోని గుడియాత్తం రోడ్డులో మైనింగ్ ఆఫీస్ పక్కన నాలుగో తరగతి ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం గతంలో కొంత భూమిని రిజర్వు చేసింది. దీనిపై కన్నేసిన అక్రమార్కులు సోమవారం రాత్రి జేసీబీలతో దీన్ని చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నం చేశారు. దీన్ని గమించిన స్థానికులు అక్కడున్న వాహనాలను అడ్డుకొని గొడవ చేయడంతో అక్రమార్కులు వెనక్కి తగ్గారు. మరోవైపు ఇదే రోడ్డులోని ఎక్స్‌ప్రెస్ హైవే వద్ద ఫైర్ స్టేషన్ పక్కన చెరువు పొరంబోకు స్థలం 1.60 ఎకరాలు ఉంది. దీనిపై కన్నేసిన కొందరు అక్రమార్కులు దీన్ని కబ్జా చేసేందుకు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నారు.

పట్టణంలో ఇంకా ఎక్కడెక్కడంటే...

పట్టణంలోని పెద్దచెరువు ఏరియా, ఆర్అండ్‌బీ, మత్స్యశాఖ స్థలం, వారపుసంత, గుడియాత్తం రోడ్డులోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల వద్ద, స్థానిక ట్రాన్స్‌కో స్థలాలతో పాటు ఏఎంసీ, బాలికోన్నత పాఠశాలకు ఎదురుగా ఇప్పటికే ఆక్రమణలు మొదలుపెట్టారు. మిగిలిన ప్రభుత్వ స్థలాలు ఎక్కడున్నా డేగల్లా వెంటాడి వాటిని ఎలాగైనా ఆక్రమించేందుకు నిత్యం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక మున్సిపల్, రెవెన్యూ అధికారులు తమకు సంబంధం లేదంటూ కళ్లుకనిపించని చందాన పట్టించుకోవడం లేదు. దీనిపై జిల్లా అధికారులైనా స్పందించాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

పల్లెల్లో కనుమ సందడి


ఆవులను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం


ప్రత్యేక అలంకరణలో ఆవు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీకి చెందిన తిప్పిరెడ్డిపల్లి, పెనుగొలకల, బందార్లపల్లి, కొత్తబూరగపల్లి గ్రామాల్లో మంగళవారం కనుమ పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి ముందు మహిళలు రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలను పెట్టి పూజలు చేశారు. ఎద్దులు, పాడి ఆవులను ప్రత్యేకంగా అలంకరించి బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాలతో గ్రామ పొలిమేరలోని కాటమరాజు గుడి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి, పశువులు వృద్ధిచెందాలని కోరుతూ పూజలు చేశారు. అనంతరం ఎద్దులను పరుగులు తీయించారు. వీటిని నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. అనంతరం చిట్లాకుప్పకు నిప్పుపెట్టి తీర్థప్రసాదాలు అందజేశారు.

వీర్నమలలో పరుష పందేలు


దూసుకెళ్తున్న ఎద్దు

రామకుప్పం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని వీర్నమల గ్రామంలో మంగళవారం ఎద్దుల పండగను కోలాహలంగా నిర్వహించారు. అందులోభాగంగా ఎద్దులను అలంకరించి గ్రామ దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని పశువులను ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి రైతులు తమ పశువులను పరుగులు పెట్టించారు. ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు.

మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

పలమనేరు: బ్యాంకులో రూ.14లక్షలు రుణాన్ని పొంది కట్టకుండా మోసం చేసిన పట్టణానికి చెందిన అనిల్ అనే వ్యక్తిపై సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ అనిల్‌కుమార్ జిల్లా ఎస్పీ మణికంఠ చందోలును కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక పోలీసులకు అనీల్‌పై మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక సీఐ నరసింహరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పుంగనూరు : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. పట్టణంలోని టీస్టాల్ వ్యాపారి వల్లిబాషా మంగళవారం ఉదయం ఎంబీటీ రోడ్డు మీదుగా వెళ్తున్నాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి బాషాను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు గాయపడ్డ అతన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కురవల నిరసన


నిరసన తెలుపుతున్న కురవ సంఘం నేతలు

రొంపిచెర్ల : మదాసి కురవ, మదారి కురవ కులాలు ఎస్సీ కులంలో ఉన్నాయని అయితే బీసీ కులపత్రాలు ఇస్తుండడంతో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో కురవలు వెనుకబడుతున్నారని చిత్తూరు కలెక్టరేట్‌లో ఎస్సీ కుల ఏ,బీ,సీ,డీ వర్గీకరణకు వేసిన కమిషన్ చైర్మన్ మిశ్రాకు ఫిర్యాదు చేశారు. కురవలకు ఎస్సీ కుల ధ్రువపత్రాలు మంజూరు చేసేందుకు నివేదికను ప్రభుత్వానికి ఇస్తామని చైర్మన్ హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా మదాసి కురవ, మదారి కురవ (ఎస్సీ) సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లీ జయన్న మాట్లాడుతూ.. కురవ కులస్తులకు ఎస్సీ కుల సర్టిఫికెట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు, నారా లోకేష్ కురవలకు ఎస్సీ కుల జాబితాలో చేర్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కుల సంఘం నాయకులు జబ్బాల రవీంద్ర, కప్పల రాజ, జర్రాపల్లె వెంకటమల్లు, దుబ్బిగాళ్ల రమేష్, శ్రీనివాసులు, దుర్గం బాలకృష్ణ, వసంతకుమార్ పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు


కుమ్మరగుంటలో ఊరేగింపుగా తీసుకొచ్చిన పశువులు

పుంగనూరు : సంక్రాంతి వేడుకలను పట్టణం, పల్లెల్లోనూ మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. గ్రామస్తులందరూ కలసి పశువులను శుభ్రం చేసి అలంకరించారు. తమకు ఇష్టమైన సినిమా హీరోలు, రాజకీయ నాయకుల బొమ్మలు , బెలూన్లు పశువులకు కట్టి ఊరేగింపు చేశారు. ఎలాంటి విభేదాలు లేకుండా కాటమరాజు గుడి వద్ద చిట్లాకుప్ప వెలిగించి, పశువులకు చూపించి దిష్టి నివారణ చర్యలు చేపట్టి, జంతుబలులు సమర్పించారు. రాష్ట్రమంతా సంక్రాంతిని 14,15,16 తేదీల్లో జరుపుకోగా ఈ ప్రాంతంలో మాత్రం ఈ మంగళవారం రోజు నుంచి ఈనెలాఖరు వరకు జరుపుకోవడం విశేషం.